

మిషన్ భగీరథపై విజిలెన్స్ ఆరా!

- ఉమ్మడి జిల్లాలో చేపట్టిన మిషన్ భగీరథ పనులపై విజిలెన్స్ అధికారుల నజర్
- సర్కిల్ కార్యాలయం నుంచి పనుల వివరాల సేకరణ
- గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులను తనిఖీ చేయనున్న అధికారులు
- విజిలెన్స్ నజర్‌తో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల్లో మొదలైన ఆందోళన

నిజామాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా మిషన్ భగీరథ పనులపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. పనుల తనిఖీలకు రంగం సిద్ధం చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టినపనులపై వివరాలను సేకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో చేపట్టిన రెండు గ్రిడ్‌లకు సంబంధించిన పనులు, గ్రామాల్లో చేపట్టిన పైప్‌లైన్‌ల పనులు, ఓవర్ హెడ్ ట్యాంకులకు సంబంధించిన పనులను పరిశీలించనున్నారు. ఇప్పటికే గ్రామాల వారీగా చేపట్టిన పనుల వివరాలపై గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ సర్కిల్ కార్యాలయం నుంచి నివేదికలను తీసుకున్నారు. ఒకటి రెండు రోజుల్లో పనులపై గ్రామస్థాయిలో పరిశీలించనున్నారు. రాష్ట్రస్థాయిలో చేపట్టిన ఈ పనుల్లో భారీ ఎత్తున అవినీతి జరిగిందని భావిస్తున్న ప్రభుత్వం విజిలెన్స్ ఎంక్వైరీకి ఆదేశాలు ఇవ్వడంతో ఆ శాఖ అధికారులు వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు.

తాగునీటికి 'మిషన్ భగీరథ'

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రస్థాయిలో అన్ని గ్రామాలకు తాగునీటిని అందించేందుకు మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టింది. ఈ పథకం కింద గ్రిడ్‌ల నిర్మాణం చేపట్టడంతో పాటు గ్రామాల్లో పైప్‌లైన్‌లను వేశారు. ప్రతి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి ఇంటింటికి తాగునీటి సరఫరా చేపట్టారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు గ్రిడ్‌ల నిర్మాణం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో రెండు గ్రిడ్‌ల నిర్మాణం ఈ మిషన్ భగీరథ కోసం చేపట్టారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఒక గ్రిడ్ నిర్మాణం 1350 కోట్లతో చేపట్టారు. నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాలతో పాటు కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని కొన్ని మండలాలకు ఈ గ్రిడ్ ద్వారా తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. పనులను పూర్తి చేశారు. ఎస్సారెస్పీలోంచి నీటిని ఇందల్వాయి మండలం మల్లన్న గుట్ట వరకు తరలించి అక్కడి నుంచి కామారెడ్డి జిల్లా పరిధిలో తాగునీటిని అందిస్తున్నారు. మిషన్ భగీరథ పథకాన్ని పూర్తి చేయడంతో పాటు గ్రిడ్ పరిధిలోని గ్రామాలకు నీటి సరఫరా కొనసాగిస్తున్నారు. ఈ పథకం కింద గ్రిడ్‌తో పాటు గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులకు కూడా నిధులను విడుదల చేశారు. గ్రిడ్ పనులు సజావుగానే జరిగిన గ్రామాల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తనిఖీలకు ఆదేశించింది. మరొక గ్రిడ్‌ను సింగూరు ప్రాజెక్టు నుంచి 1300 కోట్ల రూపాయలతో చేపట్టారు. ఈ గ్రిడ్ ద్వారా జుక్కల్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల పరిధిలో తాగునీటిని అందించేందుకు నిర్మాణం చేశారు. గ్రిడ్ పనులను పూర్తి చేయడంతో పాటు గ్రామాల్లో పనులను చేశారు. నిర్ణీత సమయంలో పనులు అలస్యమైనా.. తర్వాత పూర్తి చేసి మిషన్ భగీరథ పథకం కింద తాగునీటిని ప్రస్తుతం నిర్ణయించిన గ్రామాలకు సరఫరా చేస్తున్నారు.

పనుల్లో భారీ అవినీతి


బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన ఈ పనుల్లో భారీ అవినీతి జరిగినట్లు కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. గ్రిడ్ పనులతో పాటు గ్రామాల్లో నీటి సరఫరా కోసం వేసిన పైప్‌లైన్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణంలో ఎక్కువ మొత్తంలో జరిగినట్లు భావిస్తున్నారు. పలు సంఘాలు, సంస్థల నుంచి ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ తనిఖీలకు ఆదేశాలను ఇచ్చారు. గ్రామాల్లో ఉన్న పాత పైప్‌లైన్‌లు, పాత ఓవర్‌హెడ్ ట్యాంకులను కొన్ని చోట్ల కొత్తవి నిర్మించకుండానే బిల్లులు లేపినట్లు గుర్తించినట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ మిషన్ భగీరథ నిర్మాణంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు భావించిన ప్రభుత్వం విజిలెన్స్ తనిఖీలను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచే నిర్వహించాలని ఆదేశాలను ఇచ్చింది. మిషన్ భగీరథ చైర్మన్‌గా మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి కొనసాగడంతో ఈ ఉమ్మడి జిల్లా నుంచే తనిఖీలను చేపట్టేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. మిషన్ భగీరథ కోసం వినియోగించిన పైపుల కొనుగోలు, ఇతర పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి ఉండటం, డబ్బులు భారీగా చేతులు మారినట్లు గుర్తించడం, పాత ట్యాంకులకే బిల్లులు పెట్టినట్లు ఆరోపణలు రావడంతో తనిఖీలను చేపట్టారు.

వివరాలు సేకరిస్తున్న అధికారులు

ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర విజిలెన్స్ అధికారులు అన్ని ఉమ్మడి జిల్లాల ఆర్‌డబ్ల్యూఎస్ సర్కిల్ కార్యాలయం నుంచి వివరాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నాలుగు రోజుల క్రితమే విజిలెన్స్ అధికారులు వివరాలు కోరడంతో శాఖ తరపున వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అందించారు. నిజామాబాద్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని ఎస్ఆర్ఎస్‌పీ గ్రిడ్, సింగూరు గ్రిడ్‌ల వివరాలతో పాటు గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను మండల వారిగా అందించినట్లు సమాచారం. విజిలెన్స్ అధికారులు వివరాలు అడగడంతో అన్ని మండలాల నుంచి పనుల వివరాలను తెప్పించి సర్కిల్‌కు సంబంధించిన ఎస్ఈ ద్వారా అందించినట్లు తెలిసింది. అప్పటి ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టిన కొంత మంది అధికారులు ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పనిచేస్తుండగా మరి కొంత మంది అధికారులు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. కొన్ని మండలాలు, డివిజన్ స్థాయిలో కొత్త వారు ఉన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరిధిలో చేపట్టిన మిషన్ భగీరథ పనుల వ్యవహారంపై విజిలెన్స్ అధి కారుల దర్యాప్తు మొదలు కావడంతో అధికారుల్లోనూ అలజడి మొదలైంది. పెద్ద ఎత్తున పనులు చేపట్టడం గ్రామాల్లో కొన్నిచోట్ల పాత పైప్‌లైన్‌ల ద్వారానే నీటి సరఫరా కొనసాగడం వల్ల విజిలెన్స్ దర్యాప్తు గ్రామస్థాయిలో మొదలైతే తమకు ఇబ్బంది వస్తుందని వారు భావిస్తున్నారు. అప్పటి ప్రభుత్వ హయాంలో పనిచేసిన కొంత మంది ఇంజనీర్లు కూడా రిటైర్డ్ కాగా మరికొంత మంది ఈనెల నుంచే రిటైర్డ్ కానున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో పనిచేయడం ఇప్పుడు దర్యాప్తును ఎదుర్కోవాల్సి రావడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో విజిలెన్స్ అధికారులు మాత్రం బృందాలుగా ఏర్పడి మిషన్ భగీరథపై దర్యాప్తు కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ కార్యాలయం లేకపోవడం పాత నిజామాబాద్, మెదక్ జిల్లాలకు సంగారెడ్డిలో విజిలెన్స్ కార్యాలయాలను ఏర్పాటు చేయడం వల్ల అక్కడి అధికారులు ఈ దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. మిషన్ భగీరథ పనులకు సంబంధించిన వివరాలను విజిలెన్స్ అధికారులు తీసుకువెళ్లారని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు చెందిన అధికారులు తెలిపారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో పనులను పరిశీలించడం లేదని నివేదికలు మాత్రమే పరిశీలిస్తున్నారని వారు తెలిపారు. కాగా, రెండు రోజుల్లో విజిలెన్స్ అధికారులు వచ్చి తనిఖీలు చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్

- జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా అనిల్ కుమార్



నిజామాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కేసీఆర్ ప్రకటించారు. జహీరాబాద్ టికెట్ అనిల్ కుమార్‌కు కేటాయించారు. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో బీసీ అభ్యర్థులకే టికెట్‌ను కేటాయించారు. రాష్ట్రస్థాయిలో మారుతున్న సమీకరణలకు అనుగుణంగా మాజీ సీఎం కేసీఆర్ వీరిని ఎంపిక చేశారు. నిజామాబాద్ జిల్లాలో ఎమ్మెల్యేగా నాలుగు దఫాలు గెలిచిన బాజిరెడ్డి గోవర్ధన్ జిల్లాస్థాయిలో అందరికి తెలిసినవాడు కావడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. జిల్లాలో ఆర్మూర్, బాన్సువాడ నియోజకవర్గాల నుంచి ఒక్కొక్కసారి, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేశారు. జిల్లాలో కూడా అన్ని నియోజకవర్గాలకు చెందిన నేతలతో చర్చించిన మీదట పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. బీసీ వర్గానికి చెందిన ఓటర్లు కూడా పార్లమెంట్ పరిధిలో యాభై శాతానికి పైగా ఉండడం వల్ల సీనియర్ నేత బాజిరెడ్డిని ఎంపిక చేశారు. పార్టీలో చాలా ఏళ్ల నుంచి పని చేస్తున్న అనిల్ కుమార్‌కు జహీరాబాద్ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు. అక్కడ రెండు సార్లు ఎంపీగా పని చేసిన బీబీ పాటిల్ బీజేపీలోకి వెళ్లడంతో పఠాన్‌చెరువుకు చెందిన ఆయనను ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న రెండు పార్లమెంట్ సీట్లను కూడా బీసీలనే అభ్యర్థులుగా ఖరారు చేశారు. వీరు ఒకటి రెండు రోజుల్లో ప్రచారం మొదలుపెట్టనున్నారు. తనను పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సారంగపూర్ చక్కెర కర్మాగారాన్ని

త్వరలోనే పునఃప్రారంభిస్తాం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్, మార్చి 13: సారంగపూర్ చక్కెర కర్మాగారం పునరుద్ధరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకు కావలసిన అన్ని చర్యలు తీసుకుంటుందని రూరల్ ఎమ్మెల్యే ఆర్.భూపతిరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి సారంగపూర్‌లోని చక్కెర కర్మాగారాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఫ్యాక్టరీలోని యంత్రాలు, ఇతర గదులను తిరిగి చూశారు. అనంతరం ఫ్యాక్టరీ ఆవరణలో చక్కెర రైతులు, కార్మికులు, ఫ్యాక్టరీ పరిరక్షణ సమితీ నేతలతో కలిసి మాట్లాడారు. వేల మంది చెరుకు రైతులు, వందల సంఖ్యలో కార్మికులు ఫ్యాక్టరీపై ఆధారపడి ఉన్నారని గుర్తుచేశారు. గత ప్రభుత్వాలు ఈ ఫ్యాక్టరీ పునరుద్ధరణను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూతపడిన ఫ్యాక్టరీల పునరుద్ధరణ కార్యక్రమం రూపుదాల్చుకుందన్నారు. బోధన్‌లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీతోపాటు సారంగపూర్‌లోని ఫ్యాక్టరీ కూడా పునరుద్ధరించబడుతుందని తెలిపారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే తాను, కలెక్టర్‌తో కలిసి ఫ్యాక్టరీ ప్రస్తుత పరిస్థితిని స్వయంగా చూసి నివేదికలు ప్రభుత్వానికి అందజేస్తానని అన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే తాము ఈ ఫ్యాక్టరీని పరిశీలించామన్నారు. ఫ్యాక్టరీలో పనిచేసిన కార్మికులు, చెరుకు రైతులు, పరిరిక్షణ సమితీ సభ్యులు, ఇతరులందరి అభిప్రాయాలు సేకరించి వారం రోజుల్లో నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ఫ్యాక్టరీని ప్రభుత్వం నిర్వహించాలని, లేనియెడల నిర్వహణ బాధ్యత కార్మికులకు అప్పగిస్తే విజయవంతంగా నిర్వహిస్తామని పరిరక్షణ అధ్యక్షుడు కొండల సాయిరెడ్డి, ఆకుల పాపయ్య తెలిపారు.



ఫ్యాక్టరీలోని మిషనరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, కార్మికులు

జిల్లాలో ఇద్దరు ఆర్‌డీవోల బదిలీ

- బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే వీరిని బదిలీ చేసిన సర్కారు

నిజామాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని బోధన్, ఆర్మూర్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఆర్‌డీవోలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులను జారీ చేశారు. వీరి స్థానంలో కొత్తవారిని నియమించింది. ఎన్నికల బదిలీలో భాగంగా వీరిని ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. ఆర్మూర్ ఆర్‌డీవోగా గత నెలలోనే నియామకమైన రాజాగౌడ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో వరంగల్ ఆర్‌డీవోగా పనిచేస్తున్న బి.స్రవంతిని నియమించారు. బోధన్‌లో నాలుగు రోజుల క్రితమే బాధ్యతలు చేపట్టిన సీదాందత్తును బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఆదిలాబాద్ ఆర్‌డీవోగా పనిచేస్తున్న అంబదాస్ రాజేశ్వర్‌ను నియమించింది. సీదాందత్తును వరంగల్ ఆర్‌డీవోగా నియమించింది. ఆర్మూర్ ఆర్‌డీవోగా పనిచేసిన రాజాగౌడ్‌ను స్త్రీ శిశుసంక్షేమ శాఖ మేడ్చల్ జిల్లా అధికారిగా నియమించారు. ఎన్నికల బదిలీలోగా వీరిని బదిలీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోసమే బోధన్‌లో పనిచేస్తున్న రాజాగౌడ్‌ను ఆర్మూర్‌కు గత నెలలో బదిలీ చేశారు. జిల్లాలో పనిచేస్తుండటం వల్ల ఆయన్ను సీఈసీ ఆదేశాల మేరకు మేడ్చల్‌కు బదిలీ చేశారు. సీదాందత్తును కూడా ఆదిలాబాద్ నుంచి ఇక్కడికి బదిలీ చేయగా ఆయనను వరంగల్ జిల్లాకు బదిలీ చేశారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

- కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షల్లో ఇద్దరు డిబార్

నిజామాబాద్ అర్బన్, మార్చి 13: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రధాన పరీక్షలు బుధవారం ముగిశాయి. గత నెల 28న ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సరం రెగ్యులర్ పరీక్షలు ముగిశాయి. ద్వితీయ సంవత్సరం ప్రధాన పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఇంటర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా 18,825 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 18వేల 75 మంది హాజరు కాగా 750 మంది గైర్హాజరయ్యారు. కోటగిరి జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థి, నిజామాబాద్ సత్య వొకేషనల్ కళాశాలలో ఓ విద్యార్థి మాస్ కాపీయింగ్‌కు పాల్పడగా వారిపై మాస్ కాపీయింగ్ కేసు నమోదు చేశారు. డీఈసీ కమిటీ 7, హెచ్‌పీసీ కమిటీ 6, ఫ్లయింగ్ సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 33, డీఐఈవో 1 పరీక్షా కేంద్రం, బోర్డ్ స్క్వాడ్ 3 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

కేంద్రాల వద్ద విద్యార్థుల ఉత్సాహం..

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ముగియడంతో పరీక్షా కేంద్రాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా బయటకు వచ్చారు. హమ్మయ్య పరీక్షలు ముగిసాయంటూ ప్యాడ్‌లు, పేపర్‌లు గాల్లోకి ఎగిరేసి సంబరాలు చేసుకున్నారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు తల్లిదండ్రులు, సంరక్షకులు వెంట రాగా ఇళ్లకు వెళ్లారు. దీంతో బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు విద్యార్థులతో సందడిగా మారాయి.



పరీక్ష కేంద్రం ఎదుట విద్యార్థుల కేరింతలు



బస్టాండ్ వద్ద విద్యార్థుల సందడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

వర్గీకరణతోనే మాదిగల జీవితాల్లో వెలుగులు

- మందకృష్ణ మాదిగ

జక్రాన్‌పల్లి, మార్చి 13: బీజేపీకి అండగా ఉందామని వర్గీకరణనే మాదిగల జీవితాలలో వెలుగులు నింపుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని అర్గుల్ గ్రామంలో యమున గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, మాదిగ అధ్యక్షతన నిజామాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంఆర్‌పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరైన అనంతరం జరిగిన సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. అంబేద్కర్ సాధించిన రిజర్వేషన్లలో మాన వాట కోల్పోయామని అన్ని రంగాలలో వెనకబడి ఉన్నామని, భారతదేశంలో ఎంత సుదీర్ఘంగా ఉద్యమం నడుస్తుందంటే ఎమ్మార్పీఎస్ ఉద్యమమం మాత్రమే నడుస్తుందన్నారు. దేశంలో ఎన్నో ఉద్యమాలు వచ్చాయి కానీ నాలుగైదేళ్ళకు మించి నిలవలేకపోయయన్నారు. ఇదీ వాస్తవమని 30ఏళ్లుగా సుదీర్ఘంగా ఉద్యమం నడుపుతుందన్నారు. ఇంక లక్ష్యాన్ని చేరుకోలేకపోయామని, న్యాయం మనవైపు ఉందన్నారు. జన బలం మనకు ఉందని, రాజకీయ పాలుకుబడి లేకపోవడం వల్ల మనం మన లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నామన్నారు. ఇలాంటి సమయంలో నవంబర్ 11న జరిగిన విశ్వరూప మహాసభకు భారత ప్రధాని నరేంద్రమోదీని వచ్చిన తర్వాత మాదిగ జాతికి ఒక కొత్త ఊపిరి వచ్చిందన్నారు. అందరు మాదిగలు సుప్రీం కోర్టు వైపు చూస్తున్నారన్నారు. మనకు అండగా ప్రధాని నరేంద్రమోదీని అండగా ఉండాల్సిన బాధ్యత మన మీద ఉందన్నారు. విశ్వరూప మహాసభలో నో కాంగ్రెస్, నో బీఆర్ఎస్ అన్నను కాంగ్రెస్ హయంలోనే వర్గీకరణ చట్టం కొట్టి వేయబడిందన్నారు. కాంగ్రెస్ పదేళ్ల అధికారంలో ఉన్న వర్గీకరణకు ఒక అడుగు ముందుకు వెయలేదన్నారు. కాంగ్రెస్‌ను వర్గీకరణ మీద ఒక లెటర్ రాయండని సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ అన్ని వేదుకల మీద కలిసి విజ్ఞప్తి చేశానన్నారు. కానీ మన విజ్ఞప్తులను కాంగ్రెస్ పార్టీ పక్కన పెట్టిందన్నారు. పదేళ్ల కాంగ్రెస్ అధికారంలో ఉండి బిల్లు పెట్టలేదన్నారు. పదేళ్ల ప్రతిపక్షంలో ఉన్న నరేంద్ర మీద ఒత్తిడి కోసం వర్గీకరణ మీద ఒక లేఖ రాయలేదన్నారు. అలాంటి కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే బానిసలుగా ఉంటాం కానీ వర్గీకరణ జరగదన్నారు. బీఆర్ఎస్ కూడా మన ఓట్లు వేయవద్దని, దళిత ముఖ్యమంత్రిని చేస్తానని కేసీఆర్ చెపిప మోసం చేశారన్నారు. దళిత భూములను గుంజుకొని అభివృద్ధి పేరిట మోసం చేశారన్నారు. మూడు ఎకరాల భూమి ఇవ్వలేదని, రైతులను మోసం చేశారని బీఆర్ఎస్ హయంలో దళితులకు ఒక్క మంత్రి ఇవ్వలేదన్నారు. తనను మూడుసార్లు జైల్లో పెట్టడం ఇవన్నీ సత్యం కాదా నో బీఆర్ఎస్ అని అన్నానన్నారు. ఈ ఈ సమావేశంలో జిల్లా ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి మాదిగ, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కనక రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, ఉపాధ్యక్షుడు మారుతి, రమేష్, ప్రవీన్, ఎంహెచ్‌పి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మైలారం బాలు, యమున సత్తెక్క, పద్మ, సావిత్రి, మహేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు

- పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిలతో హైదరాబాద్‌లో సమావేశం
- వివరాలు సేకరిస్తున్న ఏఐసీసీ నేతలు

నిజామాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై రాష్ట్ర ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఇద్దరు జిల్లా అధ్యక్షులతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జిల నుంచి వివరాలను సేకరించారు. పోటీ చేసే అభ్యర్థి ఎంపికపై అభిప్రాయాలను తీసుకున్నారు. ఏఐసీసీ నేతల ఆదేశాల మేరకు ఈ అభిప్రాయ సేకరణ చేపట్టారు. రాష్ట్రంలో వివిధ పార్లమెంట్ పరిధిలో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై ఆయా పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జిలు దీపాదాస్ నుంచి ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శులు రోహిత్‌చౌదరి, మహ్మద్ అలీఖాన్, విష్ణునాథ్‌లు వీరితో చర్చలు జరిపారు. ఈ సమావేశానికి నిజామాబాద్ పార్లమెంట్ నుంచి ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణు, గత ఎన్నికలో పోటీ చేసి ఓటమి చెందిన నియోజకవర్గ ఇంచార్జిలు వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, నర్సింగరావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో పాటు జగిత్యాల జిల్లా అధ్యక్షుడితో ఈ సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గాల ఇంచార్జిల అభిప్రాయాలను తీసుకున్నారు. పార్లమెంట్ పరిధిలో పోటీలో ఎవరెవరు ఉన్నారో అభ్యర్థులను వివరిస్తూ ఎవరికి అనుకూలంగా ఉంటుందో వివరాలను అధిష్ఠానానికి వివరిస్తామని తెలిపారు. ఏఐసీసీ ఇన్‌చార్జిలతో జరిగిన సమావేశంలో ప్రధానంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనిల్ అభ్యర్థిత్వాల మధ్యనే ఎక్కువగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కూడా వీరివైపే మొగ్గు చూపినట్లు సమాచారం. ఎక్కువ మంది ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి అనుకూలంగా ఉన్నట్లు రాష్ట్ర ఇన్‌చార్జిలతో పాటు ఏఐసీసీ నేతలకు వివరించినట్లు తెలుస్తోంది. వీరితో పాటు సునీల్‌రెడ్డి, ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి అభ్యర్థిత్వాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. పార్లమెంట్ పరిధిలోని నేతల అభిప్రాయాలను తీసుకున్న ప్రధానంగా ఏఐసీసీ నేతలు తీసుకునే నిర్ణయం ఆధారంగానే అభ్యర్థిని ఎంపిక చేయనున్నారు.

రంజాన్ వేళలు

గురువారం	శుక్రవారం
ఇఫ్తార్ సా. 6.31	సహర్ ఉ. 5.02



తప్పులు చేయడం సహజం.. చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెందినవాడే శ్రేష్ఠుడు

భార్యను చంపి భర్త ఆత్మహత్య

- మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆడియో విడుదల
- భార్యను ఒంటరిగా విడిచి వెళ్లలేకనే హత్యచేసినట్లు వెల్లడి
- ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో నడవడం లేదని ఆవేదన
- తల్లిదండ్రుల మరణంతో అనాథ అయిన కుమారుడు


స్వామి, దేవలక్ష్మి దంపతుల మృతదేహాలు

ఖిల్లా, మార్చి 13: భార్యను హత్య చేసి తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని శ్రీనివాస్ కాలనీ కెనాల్ కట్ట వద్ద బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్‌కు చెందిన గోరి మెడ్ల స్వామి (47) ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతనికి భార్య దేవలక్ష్మి(42), ఇంటర్ చదివే కుమారుడు మల్లిఖార్జున్ ఉన్నారు. స్వామి గత కొంత


రోదిస్తున్న కొడుకు మల్లిఖార్జున్

కాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఇటీవలి కాలంలో ఆటో సక్రమంగా నడవక పోవడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో భార్యభర్తలకు బుధవారం ఉదయం గొడవ జరిగింది. దీంతో క్షణికావేశంలో స్వామి తన భార్య దేవలక్ష్మిని గొంతునులిమి హత్య చేశాడు. ఆ తర్వాత తానూ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు మల్లిఖార్జున్ ఇంటర్ పరీక్ష రాసి.. ఇంటికి తిరిగి వచ్చాక జరిగిన దారుణాన్ని చూసి బోరుమని విలపించాడు. వెంటనే సమాచారాన్ని పోలీసులకు తెలియజేశాడు. కాగా.. ఆత్మహత్యకు ముందు స్వామి తన బంధువులకు వాట్సప్‌లో ఆడియో రికార్డును పంపాడు. తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, ఎవరి మీద కేసులు పెట్టవద్దని పోలీసులను వేడుకున్నాడు. మనశ్శాంతి లేక మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వెల్లడించారు. భార్యను ఒంటరిగా విడిచి వెళ్లలేకనే హత్యచేసినట్లు తెలిపాడు. తన వద్ద ఉన్న బంగారం, భార్య మెడలోని నగలను, ఇంటికి సంబంధించిన పత్రాలను బీరువాలో మూట కట్టి ఉంచానని.. వాటిని తన కొడుకు మల్లిఖార్జున్‌కు అందజేయాలని కోరారు. తన కొడుకు మల్లిఖార్జున్ ఇష్టమైన వారి వద్ద ఉండేలా చూడాలని ఆడియో ద్వారా కోరాడు. కొన్ని రోజులుగా ఆటో నడవడం లేదని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో.. తన ఆటో నడవడం లేదని తెలిపాడు. తన ఆటోకు సంబంధించి పేపర్లు లేకపోవడంతో.. ఆటో నడిపిస్తే పోలీసులు వేధిస్తున్నారని తెలిపాడు. కాగా.. తల్లిదండ్రుల మరణంతో కుమారుడు మల్లిఖార్జున్ అనాథ అయ్యాడు. మరోవైపు.. ఈ సమాచారం అందుకున్న నిజామాబాద్ నార్త్ రూరల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


టీయూలో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మిషన్ సెమీ కండక్టర్ తయారీలో దేశ యువత ముందుండాలి: మోదీ

డిచ్‌పల్లి, మార్చి 13: ప్రధాని నరేంద్రమోదీ వీక్షిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా 1.25లక్షల కోట్ల విలువలైన 3 సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో వివిధ విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రధాని కార్యక్రమం వీక్షించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ దేశ యువత స్వదేశీ పరిజ్ఞానంతో సెమీ కండక్టర్‌లతో ముందుకెళ్లడం దేశానికే గర్వకారణమన్నారు. ఈ పద్ధతి ద్వారా సెమీ కండక్టర్ వ్యవస్థ బలోపేతం అవుతుందని, దీనితో కమ్యూనికేషన్, ఆటో మోబైల్స్, వైద్య, ఇంధన, ఉపగ్రహ నిర్మాణరంగంలో స్థిరమైన స్థావరాలు ఏర్పాటుఅవుతాయని, భవిష్యత్తు ఈ పరిశ్రమ ద్వారా వేలాదిమందికి యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని న్నారు. ప్రత్యేక ప్రసారంలో రూసా నోడల్ ఆఫీసర్ డా.వాసంచంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ఆరతి, వైస్‌ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ప్రొ.నసీం,ప్రొ.లావణ్య, ప్రొ.సంపత్‌కుమార్, డా.భ్రమంరాభిక, విద్యార్థులు ఉన్నారు.

రూ.13.11 లక్షలు పలికిన నడిపల్లి తైబజార్ వేలం

డిచ్‌పల్లి, మార్చి 13: మండలంలోని నడిపల్లి తైబజార్ వేలం పాటను బుధవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి కిషన్‌రావు హాజరయ్యారు. డిచ్‌పల్లికి చెందిన జావిద్ అనే వ్యాపారి రూ.13,11,000లకు వేలంతో తైబజార్‌ను దక్కించుకున్నాడు.

'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

నిజామాబాద్ అర్బన్, మార్చి 13: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం నిజామాబాద్ డివిజన్ స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఏడు పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నట్లు విద్యార్థులకు తెలపాలని ఆయన అన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో రామారావు, సెక్టోరియల్ అధికారి వనిత, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నిజామాబాద్ అర్బన్, మార్చి 13: ఆశా వర్కర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 2021, 2022, 2023 లెప్రసీ సర్వే బిల్లులను చెల్లించిన తర్వాతే ఈ సంవత్సరం లెప్రసీ సర్వే చేపడుతామని ఆశావర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నూతన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా లెప్రసీ సర్వే బిల్లులు చెల్లించక అనేక మార్లు ధర్నాలు నిర్వహించిన ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికే పెండింగ్ బిల్లులు రాలేదని గత మూడేళ్లుగా అధికారులు బిల్లులు మంజూరు చేస్తామని చెబుతున్నా ఇవ్వడం లేదన్నారు. ఇతర జిల్లాలో లెప్రసీ బిల్లులు మంజూరు చేసిన నిజామాబాద్ జిల్లాలో ఎందుకు ఇవ్వడం లేదని దీనిపై సమగ్ర విచారణ జరిపి బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. గతంలో సర్వే ఫార్మట్‌కు సంబంధించి పేపర్లు ఇచ్చేవారని కాని ఇప్పుడు ఆశావర్కర్లకే జిరాక్స్ తీసుకోమని చెబుతున్నారని పెండింగ్ బిల్లులు ఇవ్వకపోగా స్టేషనరీ ఖర్చు అదనమవుతుందని దీనిపై వెంటనే అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ, రేణుఖ, సుఖన్య, బాలమణి, రమ, సునీత, లలిత పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి

● 21టిప్పర్‌లు, రెండు జేసీబీలు పట్టివేత

ఆర్మూర్‌రూరల్, మార్చి 13: టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో మాక్లూర్ మండలం లింగంపల్లి శివారులోని అక్రమ మైనింగ్‌పై మెరుపుదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మొరం తవ్వకాలు నిర్వహిస్తున్న 21టిప్పర్‌లు, రెండు జేసీబీలను పట్టుకొని సీజ్ చేశారు. పట్టుకున్న టిప్పర్‌లు, జేసీబీలను తదుపరి చర్య నిమిత్తం మాక్లూర్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు. ఈ దాడుల్లో సీఐ అంజయ్య, పోలీస్ సిబ్బంది లక్ష్మణ్, సుదర్శన్, రాజేశ్వర్, రాములు, గజేంధర్, అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

న్యూట్రిషియన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

ధర్పల్లి మార్చి 13: గర్భిణులు న్యూట్రిషియన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో సుదర్శనం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగితెలుసుకున్నారు. అనంతరం గర్భిణులకు న్యూట్రిషియన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భందాల్చిన మూడు నెలల నుంచి ఏడు నెలల వరకు న్యూట్రిషియన్ కిట్లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని చెప్పారు. గర్భిణీ స్త్రీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణీలు న్యూట్రిషియన్ ఫుడ్ కొరత లేకుండా న్యూట్రిషియన్ తీసుకుంటే ప్రసవం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట డీసీఎస్‌హెచ్ డాక్టర్ శివశంకర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుశాంత్‌రెడ్డి, వైద్యసిబ్బంది పద్మవతి, రమేష్, సృజన, సుజాత, నిర్మల, కవిత, రాంప్రసాద్, కృష్ణ, వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

రూ.3.17 లక్షలు పలికిన జన్నేపల్లి వారంతపు సంత వేలం

నవీపేట, మార్చి 13: మండలంలోని జన్నేపల్లిలో ప్రతి బుధవారం నిర్వహించే వారంతపు సంతకు సంబంధించి బుధవారం వేలంపాట నిర్వహించగా 3.17లక్షల రూపాయలకు వేలంపాట పలికింది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ వేలంపాటలో 12మంది పాల్గొనగా నవీపేటకు చెందిన మట్ట బాలాజీ 3.17లక్షల రూపాయలకు వేలంపాట ద్వారా సంతను దక్కించుకున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 14వేల రూపాయల అదనపు ఆదాయం గ్రామ పంచాయతీకి సమకూరింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత, ప్రత్యేక అధికారి కేవీ.శ్రీనివాస రావు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

పరీక్ష రాసి.. పుట్టెడు దుఃఖంతో ఇంటికి

డిచ్‌పల్లి, మార్చి 13: నిజామాబాద్ నగరంలో ఆటో డ్రైవర్ స్వామి, లక్ష్మీ దంపతుల ఆత్మహత్య ఘటనలో ఆ మృతుల కుమారుడు మల్లికార్జున్ పరీక్ష రాసి పుట్టెడు దుఃఖంతో విలపిస్తూ ఇంటికి రావడం అందరినీ కలచివేసింది. డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ పరీక్ష రాసిన మల్లి కార్జున్ పరీక్ష రాసేందుకు వెళ్లగానే.. తన తల్లి, తండ్రి ఆత్మహత్య చేసుకున్నారు. మల్లి ఖార్జున్ కొంతకాలంగా డిచ్‌పల్లి ఆదర్శ పాఠశాలలో ఇంటర్ విద్యాభ్యాసం చేస్తున్నాడు. బుధవారం పరీక్ష రాసి ఇంటికి రాగా తన తల్లి, తండ్రి ఇంట్లో విగత జీవులుగా ఉండాన్ని చూసి విలపించగా చూపరులను కంటతడిపెట్టింది.

అమ్దాపూర్ సొసైటీ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

● తీర్మానం ఆమోదిస్తున్న అధికారులు

బోధన్‌రూరల్, మార్చి 13: మండలంలోని అమ్దాపూర్ సొసైటీ చైర్మన్ గిర్దావర్ గంగారెడ్డిపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. బుధవారం సొసైటీ సభ్యులు సమావేశానికి ఒక్కరు కూడా హాజరు కాకపోవడంతో ఇది వరకే ఉన్న చైర్మన్ గిర్దావర్ గంగారెడ్డి కొనసాగనున్నట్లు సహకార సంఘం జిల్లా అధికారి శ్రీనివాస్‌రావు వెల్లడించారు. ఇటీవల చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం కోసం 10మంది సభ్యులు సంతకాలతో కూడిన అవిశ్వాస పత్రాన్ని ముగ్గురు సభ్యులు జిల్లా కేంద్రంలో ఇవ్వడం జరిగిందని జిల్లా అధికారి తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నిబంధనల మేరకు అవిశ్వాస సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు నోటీసుల ద్వారా సభ్యులకు తెలియపరచడం జరిగిందన్నారు. ఉదయం 11 గంటలకు సమావేశాన్ని ప్రారంభించి నప్పటికీ ఒక్కసభ్యుడి కూడా సమావేశానికి హాజరు కాలేదు. సమావేశాన్ని నిర్వహించడానికి కనీసం ఏడుగురు సభ్యులు ఉండాలన్నారు. పూర్తి స్థాయిలో కోరం లేకపోవడం వలన ఇది వరకు ఉన్నటువంటి చైర్మన్‌ను కొనసాగిస్తున్నట్లు తీర్మానం చేయడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. మరోమారు సభ్యులు అవిశ్వాసం పెట్టడానికి సొసైటీ నిబంధనల మేరకు సంవత్సర కాలం ఉంటుందని అధికారి వెల్లడించారు. సంవత్సరం పాటు సొసైటీ చైర్మన్‌గా గిర్దావర్ గంగారెడ్డి కొనసాగుతాడని స్పష్టం చేశారు. సమావేశంలో సహకార సంఘాల అసిస్టెంట్ అధికారి రవీందర్, అమ్దాపూర్ సొసైటీ సీఈవో రాజేశ్వర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రతిఒక్కరూ పరమ శివుని కృపకు పాత్రులు కావాలి

వర్ని, మార్చి 13: ప్రతిఒక్కరూ పరమశివుని కృపకు పాత్రులు కావాలని హంపీ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి పిలుపునిచ్చారు. వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో బుధవారం పెద్దమ్మ తల్లి, గజ్జెలమ్మ, ఊరడమ్మ, బారెడు పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పరమ శివుడు ప్రసాదించిన ప్రసాదాన్ని మనం పొందితే జన్మ ధన్యం అవుతుందని సూచించారు. ఎవరిలో గొప్ప మనసు ఉంటుందో ఆ వ్యక్తి గొప్ప మనసే పరమేశ్వరుని చేర్చబడుతుందని బోధించారు. అంధకారాన్ని దూరం చేసి పరమ తేజస్వాన్ని ప్రకాశాన్ని అందించి పవిత్రమైన జ్ఞానాన్ని కలిగింపజేస్తే అజ్ఞానాన్ని దూరంచేసి పవిత్రమైన పూర్ణ ప్రసాదం దొరుకుతుందన్నారు. పూర్ణ ప్రసాదం ద్వారా మన జన్మ ధన్యం అవుతుందన్నారు. దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా 45రోజుల పాటు మాంసకృతులను దూరంగా ఉంచి పరమాన్నం, పెరుగు, పులిహోర ప్రసాదాలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో రుస్తుంపేట మహరాజ్ వెంకటస్వామి, తదితరులున్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదినం


జాగృతి ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ

సుభాష్‌నగర్, మార్చి 13: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని స్నేహసొసైటీ, జాగృతి ఆధ్వర్యంలో దివ్యాంగులకు పండ్ల పంపిణీ చేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలను జరిపారు. అంతకుముందు నగరంలోని కంఠేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు అవంతిరావు, లక్ష్మినారాయణ భరద్వాజ్, అపర్ణ, రాజన్న, దేవేందర్, పులిజైపాల్, కుల్దీప్, పంచరెడ్డి మురళి, సుకుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నగర పార్టీ ఆధ్వర్యంలో..

బీఆర్ఎస్ నగర పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ దండునీతూకిరణ్, హాజరయ్యారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సిర్పరాజు, మాజీ రెడ్‌కో చైర్మన్ అలీమ్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలో మాజీ ఎమ్మెల్సీ అంటూ ఫ్లెక్సీ

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు నగర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నగర అధ్యక్షుడు సిర్పరాజు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో మాజీ ఎమ్మెల్సీ అంటూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో వెంటనే గమనించిన అక్కడున్న వారు మాజీ అనే పదానికి స్టిక్కర్‌ను అతికించారు. నగర అధ్యక్షుడిగా ఉన్న సిర్పరాజు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో మాజీ అనే పదం రావడంతో కొద్దిసేపు ఫ్లెక్సీపై చర్చ జరిగింది.

ధర్నా చౌక్‌కు స్థలం పరిశీలన

● పాత కలెక్టరేట్ ఎదురుగా స్థలం కేటాయించిన ప్రభుత్వం

నిజామాబాద్ అర్బన్, మార్చి 13: జిల్లా కేంద్రంలో నూతనంగా కేటాయించిన ధర్నా చౌక్ స్థలాన్ని బుధవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌లు పరిశీలించారు. ప్రజాసంఘాలు, వివిధ పక్షాల వారు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు తెలిపేందుకు వీలుగా జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదురుగా సుమారు 1000 చదరపు గజాల స్థలాన్ని జిల్లా యంత్రాంగం ధర్నాచౌక్ కోసం కేటాయించింది. ఈ స్థలాన్ని పరిశీలించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు, ప్రజాసంఘాలు, వివిధ వర్గాల వారు తమ నిరసన తెలియజేసేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ ఎదురుగా స్థలాన్ని కేటాయిస్తూ కొత్తగా ధర్నా చౌక్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిరసనలు తెలియజేయాలనుకునే వారు ముందస్తుగా పోలీస్ శాఖ ద్వారా అనుమతి తీసుకొని కొత్తగా ఏర్పాటు చేసిన ధర్నాచౌక్ ప్రాంతంలో నిరసనలు చేపట్టాలన్నారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయం వద్ద, పాత కలెక్టరేట్ ప్రధాన రహదారికి ఆనుకొని నిరసనలు నిర్వహిస్తుండటం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని దీన్ని దృష్టిలో పెట్టుకొని కొత్తగా ధర్నాచౌక్‌కు స్థలాన్ని కేటాయించామన్నారు. అనంతరం సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు అనుమతితో ఏర్పాటు చేసిన ధర్నాచౌక్‌లోనే నిరసనలు తెలపాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఈ తరహా ఉల్లంఘనకు పాల్పడిన వారిపై మూడు కేసులు నమోదు అయ్యాయని ఆయన తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్‌డీవో రాజేంద్రకుమార్, ఏసీపీ రాజావెంకటరెడ్డి, సౌత్ తహశీల్దార్ బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

బైపాస్ రోడ్డుకు మా భూముల్ని ఇవ్వం

● అధికారులకు తేల్చిచెప్పిన మోర్తాడ్, గాండ్లపేట్ గ్రామస్థులు

మోర్తాడ్, మార్చి 13: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయరహదారికి బైపాస్ రోడ్డు మీదుగా నిర్మాణం చేపడితే తమ విలువైన భూములను ఇవ్వమని మోర్తాడ్, గాండ్లపేట్ గ్రామాలకు చెందిన రైతులు స్పష్టం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బైపాస్ రోడ్డు బాధితులైన రైతులతో ఆర్మూర్ ఆర్డీవో ఇతర అధికారులు కలిసి సమావేశం నిర్వహించారు. రైతులతో ఆర్డీవో రాజాగౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న బైపాస్ రోడ్డుకు రైతులు సహకరించాలని కోరారు. దీంతో రైతులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమ ప్రాణాలు పోయిన సరే భూములు మాత్రం ఇవ్వబోమని మహిళలు, రైతులు అన్నారు. దీంతో అధికారులు కేంద్ర ప్రభుత్వానికి తమ నివేదిక అందజేస్తామని అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా ఇవ్వాలని అన్నారు. అంతేగాక అధికారులు చేస్తున్న సర్వేకు సహకరించాలని కోరడంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 270

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.66,300	రూ.61,200	రూ.765

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : శైతాన్ (హింది)(10.20,1.20,4.20,7.20,10.20)
- స్క్రీన్-2 :గామి(10.00, 1.10, 4.20, 7.35, 10.45)
- స్క్రీన్-3 : భీమా (12.20,6.55) : దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (3.25) :ఆపరేషన్ వాలెంటైన్ (10.00)
- స్క్రీన్-4 : బాబు (1.30) : రికార్డుబ్రేక్ (4.15) :మంజుమెల్‌బాయ్స్ (మళయాలం) (7.15) ప్రేమలు (10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : భీమా (10.50,1.40, 4.30,7.30,10.30)
- స్క్రీన్-2 ప్రేమలు (1.30,7.30) :ఆపరేషన్ వాలెంటైన్ (4.30,10.30)
- స్క్రీన్-3 :గామి(10.30, 1.30, 4.30, 7.30, 10.30)

- దేవి :ప్రేమలు (11.15, 2.15, 6.15, 9.15)
- లలితమహాల్ : భీమా (11.15, 2.15, 6.15 9.15,)
- నటరాజ్ : శైతాన్ (హింది) (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : గామి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్